ఖైరతాబాద్‌లో 60 కి పైగా పెరగనున్న పోలింగ్ స్టేషన్లు

ఖైరతాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం సంతరించుకున్న ఖైరతాబాద్ నియోజకవర్గంలో దాదాపు 60కి పైగా పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులు నజ్రీ నక్షాల రూపకల్పనలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ నియోజకవర్గంలో గడచిన 7 నెలల్లో 6,843 ఓట్లు తగ్గాయి.

ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లు..

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్ల కంటే తక్కువ ఉండాలి. ఇప్పటి వరకు ఎన్నికలు జరిగిన ప్రతిసారీ 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలింగ్ బూత్‌లను అక్కడే ఏర్పాటు చేసి ఏ, బీలుగా విభజించి ఓట్లు వేయించేవారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం 1,200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాల వద్ద కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఈ మేరకు ఖైరతాబాద్‌లో 245 పోలింగ్ కేంద్రాలుండగా, 1,200 మంది ఓటర్ల కంటే తక్కువ ఉన్న కేంద్రాలు 111 ఉన్నాయి. 134 కేంద్రాల్లో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారు. ఈ లెక్కన దాదాపు 62 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అనివార్యం కాగా, దాదాపు మరో నాలుగు పోలింగ్ కేంద్రాలు అదనంగా రానున్నాయి. మొత్తం మీద ఇక్కడ 66 పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి.



ఖైరతాబాద్ నియోజకవర్గ మ్యాప్

ఏడు నెలల్లో తగ్గిన 6 వేలకు పైగా ఓటర్లు

త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్?

అతి త్వరలోనే ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ప్రతిసారీ స్పెషల్ సమ్మరీ రివిజన్‌ల పేరుతో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకొని సవరించేవారు. ప్రతీ 5 సంవత్సరాలకు ఓమారు ఇంటెన్సివ్ రివిజన్ చేయాల్సి ఉన్నా, చాలా సంవత్సరాలుగా చేయకపోవడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలోనే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతీ ఓటరుకు ఒక ఫారం ఇచ్చి దాన్ని నింపి ఇచ్చేలా, దానితో పాటు మరెక్కడా ఓటు లేదనే ధ్రువీకరణపత్రం సమర్పించేలా చేయనున్నట్లు సమాచారం. దీంతో పాటు చనిపోయిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రాలతో తొలగించేలా, చిరునామా మారిన వారి ఓట్లను చుట్టుపక్కల వారి సంతకాలతో తొలగించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది అమలైతే ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీని కోసం ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు అర్హత ఉన్న పర్మినెంట్ ఉద్యోగులతో బూత్ స్థాయి అధికారులను నియమించి వారికి శిక్షణ ఇప్పించారు. త్వరలోనే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కొత్త పోలింగ్ కేంద్రాల కోసం స్పెషల్ ఫోకస్..

కొత్తగా ఏర్పాటయ్యే పోలింగ్ కేంద్రాల కోసం ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది స్థానిక రాజకీయ నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఇబ్బందులున్న పోలింగ్ కేంద్రాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో పాటు నజ్రీ నక్షాలను రూపొందిస్తూ ఒక భవనానికి చెందిన ఓటర్లందరు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా, రోడ్ల ఆధారంగా నాలాల ఆధారంగా ఓటర్లు సులభంగా కేంద్రాలకు చేరుకొని ఓట్లు వేసేలా చూడడంతో పాటు కేంద్రాలలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

కొత్త పోలింగ్ బూత్‌ల కోసం దాదాపు ఖరారైన ప్రాంతాలు

జనవరి 25న తుది నోటిఫికేషన్ ప్రకారం..	
పురుష ఓటర్లు	1,53,833
మహిళా ఓటర్లు	1,42,516
ఇతర ఓటర్లు	34
మొత్తం ఓటర్లు	2,96,383

ప్రస్తుత ఓటర్లు 6-8-25 వరకు..	
పురుష ఓటర్లు	1,49,330
మహిళా ఓటర్లు	1,40,173
ఇతర ఓటర్లు	37
మొత్తం ఓటర్లు	2,89,540

7 నెలల్లో తగ్గిన ఓటర్లు **6,843**

ప్రస్తుతం పోలింగ్ స్టేషన్లు **245**

1,200 ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ బూత్‌లు **134**

అదనంగా వచ్చే పోలింగ్ కేంద్రాలు దాదాపు **66**



కృష్ణానగర్‌లో నీట మునిగిన వ్యాపార సముదాయాలు



అంబేద్కర్ నగర్‌లో నాలా పొంగడంతో ఇళ్లలోకి చేరిన వరదనీరు



సోమాజిగూడ సర్కిల్‌లో నిలిచిన వరద నీరు



నీట మునిగిన ద్విచక్ర వాహనాలను బయటకు తీసుకొస్తున్న బస్తీవాసులు

భారీ వర్షం.. తప్పని తిప్పలు

- చెరువులను తలపించిన రహదారులు
- పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేటలో ట్రాఫిక్‌జామ్



ప్రగతిభవన్ వద్ద వరద నీటి డ్రైన్‌లను సిబ్బందితో శుభ్రం చేయిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షం మరోసారి వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. కార్యాలయాలు, కళాశాలలు వదిలే సమయంలో భారీగా వర్షం పడడంతో ఉద్యోగులు, విద్యార్థులు అనేక కష్టాలు పడ్డారు. తీవ్ర ట్రాఫిక్‌జామ్ కావడంతో గమ్య స్థానాలకు చేరుకునేందుకు గంటల కొద్ది సమయం పట్టింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా గంటపాటు కురిసిన వర్షం కారణంగా రోడ్లపై భారీగా వరద నీరు నిలిచింది. సోమాజిగూడ, ప్రగతిభవన్, పంజాగుట్ట, కృష్ణానగర్, అమీర్‌పేట ప్రాంతాల్లో రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలిగాయి. వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. రంగంలోకి దిగిన ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ చెత్తతో మూసుకుపోయిన మ్యాన్‌హోళ్లను సిబ్బందితో దగ్గరుండి శుభ్రం చేయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ముంపులో నాలా పరీవాహక ప్రాంతాలు

భారీ వర్షం కారణంగా నాలా పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్ నగర్ నాలా పొంగి వరద నీరు ఇళ్లల్లోకి చేరాయి. బస్తీలోకి నడుములోతు నీరు రావడంతో స్థానికులు అనేక అవస్థలు పడ్డారు. పలు ఇళ్లల్లో వంట సామగ్రి, ఫర్నిచర్ వరద నీటి పాలయ్యాయి. ద్విచక్ర వాహనాలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. బంజారా హిల్స్‌లోని బంజారా నాలా ఉధృతంగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలైన అంబేద్కర్ నగర్‌ను వరద నీరు ముంచెత్తింది. కొన్నిచోట్ల నాలా రిటైనింగ్ వాల్ కూలిపోయే ప్రమాదం ఉందని బస్తీ వాసులు ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బంజారా నాలా పరీవాహక ప్రాంతాలను సందర్శించారు. రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు.



బంజారా నాలాను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

రిటైనింగ్ వాల్ పూర్తిగా కూలకముందే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. కృష్ణా నగర్‌ను వరద నీరు ముంచెత్తింది. జూబ్లీహిల్స్ లాంటి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వ్యాపార కేంద్రాల్లోకి వరద నీరు ప్రవేశించడంతో విలువైన సామాన్లు నీటి పాలయ్యాయి. స్థానికంగా ఉన్న ఓ అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలడంతో వరద నీరు సెల్లార్‌లోకి ప్రవేశించాయి.

స్వదేశీ జ్ఞానాన్ని పునాదిగా గుర్తించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జ్ఞానాన్ని అనుబంధంగా కాకుండా పునాదిగా గుర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంగ్లిష్, విదేశీ భాషల విశ్వవిద్యాలయం(ఇఫ్లూ)లో 'స్వదేశీ/గిరిజన సంఘాలు - పరిశోధన పద్ధతులను పునర్నిర్మించడం' అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జాతీయ పరిశోధన, విధాన చర్చలలో గిరిజన జ్ఞానం, సంప్రదాయాలు, పర్యావరణ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బిర్సా ముండా వంటి నాయకుల వారసత్వాన్ని, భారతదేశ సాంస్కృతిక, పర్యావరణ వారసత్వానికి గిరిజన సమాజాల విస్తృత సహకారాన్ని గుర్తించడంలో ప్రభుత్వం జాతీయ గౌరవ్ దివస్ నిర్వహించడాన్ని స్వాగతించారు. ఇఫ్లూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్.నాగరాజు స్థానిక ప్రపంచ దృక్పథాల విద్యా ప్రాముఖ్యతను, విస్తృత పరిశోధన పర్యావరణ వ్యవస్థలో వారికి స్థలాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని వివరించారు. సమావేశంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, గౌరవ అతిథి ప్రొఫెసర్ దీపక్‌కుమార్ బెహెరా, కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, రిజిస్ట్రార్ ఐ/సి ప్రొఫెసర్ హరిప్రసాద్, ప్రొక్టర్ శ్యామ్‌రావు రాథోడ్, స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ సోన్సా ఎం సాల్వే, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రాజునాయక్, ఇతర విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధనా పండితులు, బోధనేతర సిబ్బందితో సహా విస్తృత శ్రేణి వక్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌ల డిజైన్లు సొంతంగా రూపొందించండి



మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్ట్‌ల డిజైన్లను సొంతంగా రూపొందించండని, ప్రైవేట్ కన్సల్టెంట్లపై ఆధారపడొద్దని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన హెచ్-సిటీ, ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-2 పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూసేకరణపై సంబంధిత అధికారులతో గురువారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్ట్‌ల ప్రస్తుత పురోగతి, భూసేకరణ వ్యయం, యుటిలిటీల మార్పులో సవాళ్లు, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారం, సవాళ్లను అధిగమించేందుకు వారానికి ఒకసారి జోనల్ స్థాయిలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో జోనల్ కమిషనర్ల సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రత్యేక కోర్సులు చదివి, జీహెచ్‌ఎంసీలో ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తోన్న వారిని గుర్తించి ప్రాజెక్ట్ డిజైన్‌లో భాగస్వాములను చేయాలని చీఫ్ ఇంజనీర్ (అడ్మిన్)ను ఆదేశించారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో ఉత్పత్తులను చూస్తున్న సందర్శకులు

బంజారాహిల్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మరోవైపు శుభకార్యాలు, పండుగల సీజన్ మొదలైంది. ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు నగరవాసులు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళల మనస్సు దోచుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఈనెల 10తో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

'ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి'

పంజాగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ట్రేడ్ యూనియన్ సోషలిస్టు కూటమి జాతీయ కార్యదర్శి ఎల్.జైబాబు డిమాండ్ చేశారు. ఈనెల 19న చలో హైదరాబాద్ పేరుతో ఆబిడ్స్ గన్‌ఫౌండ్రీలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో 'ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ చట్టం' సాధన కోసం పోరుబాట, సోషలిస్టు ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కూటమి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సింగం శ్రీనివాసరావు, టీయూఎస్సీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాజుతో కలిసి సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో కూటమి నాయకులు కూనపురెడ్డి ప్రసాద్, జిలకర బాలస్వామి, అశ్విని పూలే, ఎ.సరిత పాల్గొన్నారు.

బైక్ పై నుంచి పడిన వ్యక్తి మృతి

ఖైరతాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడుపుతూ జారి పడి గాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ అస్లాం (49) బుధవారం సాయంత్రం తన యాక్టివా వాహనంపై ఇంటికి వెళ్తుండగా విరించి ఆస్పత్రి వద్ద వాహనం స్కిడ్ కావడంతో కిందపడ్డాడు. తలకు, ఛాతిపైన గాయాలైన అతడికి విరించిలో చికిత్స అందించిన అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిలో హుండీ మాయం

బంజారాహిల్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చర్చిలో హుండీ కనిపించకుండా పోయింది. ఫిలింనగర్ మహాత్మాగాంధీ నగర్‌లో యేసు క్రీస్తు ప్రార్థన మందిరం 25 ఏళ్లుగా ఉంది. ఈనెల 3వ తేదీన ప్రార్థనలు ముగించి చర్చిని మూసివేశారు. ఈనెల 5వ తేదీన ప్రధాన ద్వారం తెరిచి చూడగా హుండీ కనిపించలేదు. పరిశీలించగా కిటికీ గ్రిల్ పగలగొట్టి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ చోరీ చేశారని అందులో సుమారు రూ.10 వేల నుంచి రూ.15వేలు ఉన్నాయని, చర్చి పాస్టర్ టి.ప్రభుదాస్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పగిలిన టిప్పర్ టైరు.. తప్పిన ప్రమాదం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో టిప్పర్‌టైరు పగిలింది. ఈ సమయంలో అక్కడ వాహనాలు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టిప్పర్(టీఎస్ 08 యుజె 7531) శ్రీనగర్ కాలనీ నుంచి యూసుఫ్ గూడ వస్తుండగా, గో గ్యాస్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సమయంలో టైరు పగిలి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వాహనాన్ని తొలగించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బోరబండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బోరబండ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ బలహీనవర్గాల కాలనీ శ్రీ పెద్దమ్మనగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి బత్తుల బాబు(52)ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 26 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్(ఐఎంఎఫ్ఎల్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ స్వాప్నికుడు ప్రొ.జయశంకర్

- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన ఏకైక ఉద్యమ నాయకుడు ప్రొ. జయశంకర్ అని మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ కొనియాడారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ.జయశంకర్ 91వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'ప్రొ.జయశంకర్ అనంతర తెలంగాణ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ధర్నాచౌక్‌ను ఎత్తివేసి ప్రజాస్వామిక గొంతులను నొక్కిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అటు అమరవీరుల స్థూపం, ఇటు అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా తాళాలు వేసి తన నిరంకుశ ధోరణిని చాటుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణలోనూ విద్య, వైద్యం, సినిమా, ఇతర రంగాల్లో ఆంధ్రా వాళ్ల పెత్తనమే కొనసాగుతోందని విమర్శించారు. సామాజిక తెలంగాణ సాధించినప్పుడే ప్రొ. జయశంకర్‌కు నిజమైన నివాళి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి భావజాల సంపదను ప్రొ.జయశంకర్ చేకూర్చారని యూనివర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.విజయకృష్ణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు నగదు రహిత వైద్య సేవలు

అల్వాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా(టాసా) రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు నగదు రహిత వైద్య సేవలందించనున్నారు. స్పార్ష్ హాస్పిస్, రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం టాసా ప్రధాన కార్యాలయంలో ఎంవోయూ పత్రాలపై మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ రాజీవ్ తదితరులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంవోయూతో తెలుగు రాష్ట్రాల్లోని 2,80,749 మందికి పైగా ఉన్న మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎక్స్-సర్వీస్‌మన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్‌ఎస్) లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

వరద నీటి పైపులైన్ పనులు పరిశీలన

బోరబండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద వరదనీరు ప్రవహించేందుకు చేపట్టిన పైపులైన్ పనులను కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి గురువారం పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తద్వారా వర్షాకాలంలో నీట మునిగే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ తెలిపారు.

నాలా పెండింగ్ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



గాయత్రి నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజుల్లో నాలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమీర్‌పేట డివిజన్ గాయత్రి నగర్‌లో చేపట్టిన నాలా నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయించాలని కాలనీ వాసులు ఇటీవల మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారితో ఎమ్మెల్యే తలసానిని కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అదే రోజు అధికారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే గురువారం తలసాని వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నాలా పనులకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు పనులను అధికారులు ప్రారంభించగా, నాలాపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో గాయత్రి నగర్ లో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు పడుతున్న కష్టాలను చూసి శాశ్వత పరిష్కారం చూపాలని నాలా నిర్మాణం పనులను చేపట్టినట్లు తెలిపారు. తలసాని వెంట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఈఈ వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఎలక్ట్రికల్ ఏడీ కిశోర్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, సంతోష్ కుమార్, గోపీలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, కట్ల బలరాం, కాలనీవాసి వినోద్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో వేగం పెంచండి

- ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

బంజారాహిల్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. వరుస వర్షాల నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి గురువారం బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని బంజారాహిల్స్, బోరబండ సర్కిళ్ల పరిధిలో పర్యటించారు. నందినగర్, నూర్‌నగర్ లాంటి ప్రాంతాల్లో సమస్యలను పరిశీలించారు. వీధుల్లో నివాసాల ఎదుట ప్రమాదకరంగా ఉన్న నెట్‌వర్క్, ఇంటర్నెట్ కేబుళ్లు చూసి వెంటనే తొలగించాలని ఆదేశించారు. వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలపై గుట్టలుగా వేలాడుతున్న, వంగిపోయిన స్తంభాలను చూసి తీవ్రంగా స్పందించి వెంటనే లోపాలను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. నెట్‌వర్క్ విషయంలో లోపాలు ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. గాలి దుమారం, వర్షాలు కురుస్తున్నా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో అధికారుల పనితీరు మెరుగ్గా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ డా.నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, బంజారాహిల్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కరుణాకర్ బాబు, డీఈ హనుమంతరెడ్డి, గ్రీన్‌ల్యాండ్స్ డీఈ భీమానాయక్ పాల్గొన్నారు.



బోరబండలో పర్యటిస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మ్యాన్‌హోల్ ఏర్పాటుతో స్థానికుల హర్షం



మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేసిన జలమండలి సిబ్బంది

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమత్తులు చేయండి అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో మారేడుపల్లి జలమండలి అధికారులు స్పందించారు. వెంటనే పగిలిపోయిన మ్యాన్‌హోల్‌ను తొలగించి కొత్త మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

పాఠశాలను సందర్శించిన హైడ్రా అధికారులు

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ప్రమాదం ఉందంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన శీర్షికకు స్పందించిన హైడ్రా అధికారులు సుబ్బారావు, నరేష్ నాయక్‌లు పాఠశాలను సందర్శించి పరిస్థితిని స్కూలు ప్రిన్సిపాల్ రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో మరలా సందర్శిస్తామని ప్రమాదకరంగా ఉన్న గోడను నిర్మించేందుకు అధికారులతో మాట్లాడతామని హైడ్రా అధికారులు తెలిపారు.

బస్‌స్టేషన్ ఉన్నా.. బస్సులు ఆగవు

రేతిఫైల్ బస్‌స్టేషన్ ముందు జేబీఎస్ బస్సులు ఆపాలి

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు





ఆపకుండా రోడ్డు మధ్యలో నుంచి వెళుతున్న ఆర్టీసీ బస్సులు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో రేతిఫైల్ బస్‌స్టేషన్ ఉన్నా అక్కడ బస్సులు ఆగవు. ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సుకు ఎదురుగా మరో బస్సు అడ్డుగా వస్తేనే బస్సు ఎక్కే పరిస్థితి నెలకొంది. దీంతో రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులు దృష్టి పెట్టడటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఎంతోమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో రేతిఫైల్ బస్‌స్టేషన్ దిగి, అక్కడి నుంచి జూబ్లీ బస్‌స్టేషన్, హైటెక్ సిటీ, పఠాన్‌చెరు, జీడిమెట్ల, మేడ్చల్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. రేతిఫైల్ బస్‌స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు జూబ్లీ బస్‌స్టేషన్ వైపునకు వెళ్లే బస్సులను ఆశ్రయిస్తుంటారు. అయితే వయా రేతిఫైల్ మీదుగా వెళ్లే బస్సులను రేతిఫైల్ బస్‌స్టేషన్ ముందు ఉన్న రోడ్డులో ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది సమయం బస్సు నిలిపి ప్రయాణికులను దింపడం కాని ఎక్కించుకోవడం చేయడంలేదు. ఇప్పటికైనా అధికారులు రేతిఫైల్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. వయా రేతిఫైల్ బస్‌స్టేషన్ ముందు ఉన్న ప్రధాన రోడ్డు మీదుగా 290, 279, 90ఎల్, 49ఎం/250, 290/463, 5కె/16ఎచ్, 2, 18వీజే బస్సులు వెళ్తుంటాయి. కానీ ఇక్కడ బస్సులను ఆపకుండా వెళుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ నుంచి నడుచుకుంటూ రైల్వేస్టేషన్ ముందు ఉన్న బస్‌షెల్టర్లకు చేరుకోవాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ రోడ్డులో పిల్లలు, లగేజీతోవెళ్లడం కష్టంగా మారింది. అందుకని వయా వెళ్లే బస్సులకు ఇక్కడ హాల్టింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సులు నిలపడం వలన ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు సౌకర్యంగా ఉంటుంది. కూకట్‌పల్లి, హైటెక్ సిటీ వైపు వెళ్లే మెట్రో రైలు ప్రయాణికులకు సైతం ప్రయోజనకరంగా ఉంటుంది.

బస్‌షెల్టర్ ఏర్పాటు నిర్మించండి

రేతిఫైల్ బస్‌స్టేషన్ ముందు ఉన్న ప్రధాన రోడ్డులో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి. రైల్వేస్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్ వైపునకు వెళ్లే బస్సులు ఇక్కడ నిలిపేలా చర్యలు చేపట్టాలి. అలాగే రేతిఫైల్ బస్‌స్టేషన్ మీదుగా ఘట్‌కేసర్, హయత్‌నగర్, చెర్లపల్లి వైపునకు వెళ్లే బస్సులకు కూడా హాల్టింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు నిలపడం లేదు



వారాసిగూడ నుంచి రేతిఫైల్ బస్‌స్టేషన్‌లో దిగి జేబీఎస్‌కు వెళ్లాలంటే అటు వైపునకు వెళ్లే బస్సులను ఆపడం లేదు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు ఉన్న సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వరకు వెళ్లి అక్కడ జేబీఎస్‌కు వెళ్లే బస్సులను ఎక్కాల్సి వస్తోంది. వాహనాల మధ్య నుంచి నడవడం కష్టంగా ఉంది.

\- సత్యం, వారాసిగూడ

కష్టంగా మారింది



రైల్వేస్టేషన్‌లో దిగి ఒకటో నంబర్ గేట్ నుంచి బయటకు వచ్చే ప్రయాణికులు జూబ్లీ బస్టాండ్‌కు వెళ్లాలంటే కష్టంగా మారింది. రేతిఫైల్ దగ్గర జేబీఎస్ బస్సులు ఆపితే జేబీఎస్ దిగి జిల్లా బస్సులు ఎక్కేవారికి కూడా వెసులుబాటుగా ఉంటుంది.

\- వీరేశం, రెజిమెంటల్‌బజార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

క్రిస్టియన్ల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సనత్‌నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ వర్కింగ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కలిసిన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్టియన్లు అందరూ ఐక్యంగా ఉండాలని, డివిజన్ల వారీగా కూడా కమిటీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. నూతన కమిటీ నియోజకవర్గ పరిధిలోని పేద క్రిస్టియన్లకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి జయరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్, సభ్యులు విలియం, ప్రణయ్, సునీల్, దేవదాస్, జయ, సురేష్, మనోహర్, సామ్‌సన్, పరమానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రాఖీల పంపిణీ

మారేడుపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని చాటి చెప్పే రాఖీ పండుగ ఎంతో పవిత్రమైనదని మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు వైష్ణవి యాదవ్ తెలిపారు. గురువారం అంబేడ్కర్‌నగర్ బస్తీవాసులకు ఇంటింటికీ వెళ్లి ఉచితంగా రాఖీలు పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజారి సాంబయ్య, పి.నర్సింగరావు, ఎస్.వెంకటేష్, సురవి, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రాఫిక్ డీసీపీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో అప్రమత్తంగా ఉండాలని నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పీఎస్ భవనం, ఈ కాప్స్, జీడీ ఇన్‌చార్జి, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. మధ్యాహ్నం రోల్ కాల్ తీసుకున్నారు. నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సైలు సతీష్, శ్రీధర్, నజిమోద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు గాంధీ ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ రాజకుమారి ఆధ్వర్యంలో వైద్యుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, గాంధీ ఆస్పత్రి చిన్న పిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ వాసుదేవ్, డాక్టర్ జార్జ్, వైద్యులు సత్యనారాయణ, జానకి, ఆర్ఎంఓ-1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ సుధార్‌సింగ్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, పిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొపెసర్లు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కళాశాలలో విద్యార్థులకు ఓరియంటేషన్

చిలకలగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, ఈస్ట్ మారేడుపల్లి, శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ మహావాది సరిత తెలిపారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో గాత్ర, వాయిద్య, నృత్య విభాగాల్లో 252మంది విద్యార్థులు అడ్మిషన్లు స్వీకరించినట్లు తెలిపారు. అన్ని తరగతులలో కలిపి విద్యార్థుల సంఖ్య 471కి చేరినట్లు వివరించారు. అతి తక్కువ ఖర్చుతో నిష్ణాతులైన లెక్చరర్లతో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి సంవత్సరం విద్యార్థులు, లెక్చరర్లు అనీల్, ప్రశాంత్, శారద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అంజనేయులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ చౌరస్తా నుంచి అడ్డగుట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు గురువారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అంజనేయులును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుకారాంగేట్ నుంచి నందానార్ నగర్ వరకు 60 ఫీట్ల రోడ్డును కొంతభాగం మాత్రమే విస్తరణ చేసి మధ్యలో విడిచిపెట్టారని, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నామని చెప్పారు. లేదంటే హైకోర్టులో రిట్ పిల్ వేస్తామని కూడా కమిషనర్‌కు సూచించామని చెప్పారు.



వర్షానికి నీట మునిగిన లాలాపేట్‌లోని ప్రధాన నాలా పరివాహక ప్రాంతం

భారీ వర్షానికి నీట మునిగిన నాలా పరివాహక ప్రాంతాలు

తార్నాక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లాలాపేట్‌లోని ప్రధాన నాలా పరివాహక ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, సిరిపురి కాలనీ, చంద్రబాబునగర్ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. ఇళ్లలోకి మొకాళ్ల లోతు మురుగు నీరు చేరడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం సమయం కావడంతో ఆఫీసుల నుండి ఇంటికి చేరుకునే వాహనదారులు అటు సికింద్రాబాద్ నుండి ఉప్పల్ వెళ్లే మార్గంలో, ఇటు ఓయూ నుండి మౌలాలి వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని గంటల కొద్ది వర్షంలో తడిసి ముద్దయ్యారు.



అవగాహన ఒప్పంద కార్యక్రమంలో మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ రాజీవ్ తదితరులు

మాజీ సైనికులకు నగదు రహిత వైద్య సేవలు

- స్పార్ష్ హాస్పిస్, రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం

అల్వాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా(టాసా) రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందించనున్నారు. స్పార్ష్ హాస్పిస్, రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం టాసా ప్రధాన కార్యాలయంలో ఎంవోయూ పత్రాలపై మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ రాజీవ్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంవోయూతో తెలుగు రాష్ట్రాల్లోని 2,80,749 మందికి పైగా ఉన్న మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎక్స్- సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్ఎస్) లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ కుర్మ హేమలత

పద్మారావునగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు తాగే శిశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, తల్లిపాలు అమృతంతో సమానమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం బోయగూడలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చిన్నారుల తల్లులకు, గర్భిణీలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కుర్మ హేమలత, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.అనిల్ కుమార్, యునాని వైద్యాధికారి డాక్టర్ ఎం.ఏ. అజీజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీ.హెచ్.రోజారాణిలు మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపు వచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, అవి పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయని తెలిపారు. పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలనే అందించాలని అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, తల్లులు శిశువులకు పాలను అందించడంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలను నర్సింగ్ కళాశాల విద్యార్థులు చిత్రాలతో సవివరంగా తెలిపారు. వారోత్సవాల సందర్భంగా చిన్నారుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ఆరోగ్య అధికారులు, సిబ్బంది, ఆశావర్కర్లు, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, అబ్బాస్, నాగభూషణం, ఏసూరి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

స్వదేశీ జ్ఞానాన్ని పునాదిగా గుర్తించాలి : గవర్నర్

ఇఫ్లూలో స్వదేశీ, గిరిజన సంఘాల-పరిశోధన పద్ధతులపై అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వదేశీ జ్ఞానాన్ని అనుబంధంగా కాకుండా పునాదిగా గుర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంగ్లిష్, విదేశీ భాషల విశ్వవిద్యాలయం (ఇఫ్లూ) లో 'స్వదేశీ/గిరిజన సంఘాలు - పరిశోధన పద్ధతులను పునర్నిర్మించడం' అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జాతీయ పరిశోధన, విధాన చర్చలలో గిరిజన జ్ఞానం, సంప్రదాయాలు, పర్యావరణ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

బిర్సా ముండా వంటి నాయకుల వారసత్వాన్ని, భారతదేశ సాంస్కృతిక, పర్యావరణ వారసత్వానికి గిరిజన సమాజాల విస్తృత సహకారాన్ని గుర్తించడంలో ప్రభుత్వం జాతీయ గౌరవ్ దివస్ నిర్వహించడాన్ని స్వాగతించారు. ఇఫ్లూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.నాగరాజు స్థానిక ప్రపంచ దృక్పథాల విద్యా ప్రాముఖ్యతను, విస్తృత పరిశోధన పర్యావరణ వ్యవస్థలో వారికి స్థలాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని వివరించారు. సమావేశంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, గౌరవ అతిథి ప్రొఫెసర్ దీపక్‌కుమార్ బెహెరా, కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, రిజిస్ట్రార్ ఐ/సి ప్రొఫెసర్ హరి ప్రసాద్, ప్రొక్టర్ శ్యామ్‌రావు రాథోడ్, స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ సోన్బా ఎం సాల్వే, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రాజునాయక్, ఇతర విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధనా పండితులు, బోధనేతర సిబ్బందితో సహా విస్తృత శ్రేణి వక్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

ప్రాజెక్టుల డిజైన్లు సొంతంగా రూపొందించండి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల డిజైన్లను సొంతంగా రూపొందించండని, ప్రైవేట్ కన్సల్టెంట్లపై ఆధారపడొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన హెచ్-సిటీ, ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2 పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణపై సంబంధిత అధికారులతో గురువారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ వ్యయం, యుటిలిటీల మార్పులో సవాళ్లు, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారం, సవాళ్లను అధిగమించేందుకు వారానికి ఒకసారి జోనల్ స్థాయిలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో జోనల్ కమిషనర్ల సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రత్యేక కోర్సులు చదివి, జీహెచ్ఎంసీలో ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తోన్న వారిని గుర్తించి ప్రాజెక్టు డిజైన్‌లో భాగస్వాములను చేయాలని చీఫ్ ఇంజనీర్ (అడ్మిన్)ను ఆదేశించారు.

మాజీమంత్రి చొరవతో తెరుచుకున్న యూటర్న్

రాంగోపాలపేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని చిత్రదర్గా సమీపంలోని పెట్రోల్‌బంక్ ఎదురుగా బారికేడ్లతో మూసివేసిన యూటర్న్‌ను తెరిచినందుకు పోలీసులకు, అందుకు కృషి చేసిన మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డికి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆషాఢ బోనాల సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు యూటర్న్‌ను మూసివేశారు. బోనాలు ముగిసి చాలా రోజులు గడిచినా బారికేడ్లను తొలగించకపోవడంతో బీజేపీ నాయకులు వి.దయానందరావు నేతృత్వంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమేష్, సభ్యులు సోమవారం మర్రి శశిధర్‌రెడ్డిని కలిసి సమస్యను తెలుపగా స్పందించిన శశిధర్ రెడ్డి బారికేడ్లను తొలగించాలని ట్రాఫిక్ ఏసీపీకి లేఖ రాశారు. లేఖను అందుకున్న ఏసీపీ బుధవారం యూటర్న్ వద్ద బారికేడ్లను తొలగించాలని పోలీసులను ఆదేశించగా వారు వాటిని తొలగించి యూటర్న్‌ను అమలుపరిచేలా చర్యలు తీసుకున్నారు.



గ్యాస్ట్రో విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కు సన్మానం చేస్తున్న సూపరింటెండెంట్ రాజకుమారి

గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో విభాగాధిపతికి వీడ్కోలు

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ అందించిన సేవలు గొప్పవని గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. శ్రవణ్‌కుమార్‌కు సూర్యాపేట్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ కావడంతో గురువారం గాంధీ ఆస్పత్రి ఆవరణలోని ఆలుమిని భవనంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయనను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కరోనా కాలంలో శ్రవణ్ శ్రమించి పనిచేసి నోడల్ ఆఫీసర్‌గా మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రుల వ్యవస్థాపక చైర్మన్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, విశ్రాంతి వైద్యుడు పాండ రంగారావు, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, అభిలాష్, భరిణి, ఈశ్వర్, రమాకాంత్, వెంకటేష్, రోమన్, పీజీలు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

బొల్లారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో బొల్లారం స్నేహ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, టీబీ పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ శిబిరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవి బాలరాజు, నాగేందర్, సతీష్‌లు పాల్గొన్నారు.

\- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి



ట్రాఫిక్‌పై అవగాహన

సికింద్రాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ అశోక్ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కాలేజ్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

\- రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



వర్షం నీరుతో నిండిపోయిన రెజిమెంటల్‌బజారు

రెజిమెంటల్‌బజారులో భారీ వర్షం

అడ్డగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారిగా కురిసిన వర్షానికి సికింద్రాబాద్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒక వైపు రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు తలదాచుకున్నారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రెజిమెంటల్‌బజారులోని ప్రాంతంలో వర్షం నీరు నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ఫేక్ యూనివర్సిటీలతో జేఎన్‌టీయూ ఎంఓయూలా.!

- జర్మన్-జేఎన్‌టీయూ ఎంఓయూలపై వాస్తవాలేమిటో..
- బహిరంగ పర్చాలని వర్సిటీ విద్యార్థి సంఘాల డిమాండ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని ఫేక్ యూనివర్సిటీలతో జేఎన్టీయూ ఎంఓయూ కుదుర్చుకుందంటూ అజ్ఞాత వ్యక్తుల నుంచి వర్సిటీ డైరెక్టర్లకు ఈ మెయిల్స్ రావడం క్యాంపస్‌లో గురువారం తీవ్ర కలకలం రేపింది. జర్మనీ ప్రభుత్వ గుర్తింపు లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న రౌట్లింగన్ యూనివర్సిటీతో జేఎన్‌టీయూ ఎంవోయూ కుదుర్చుకోవాల్సిన అవసరమేంటని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎంవోయూల గురించి వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. రౌట్లింగన్ యూనివర్సిటీతో ఎంఓయూ కోర్సుల్లో ఇటీవల అడ్మిషన్ పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం జేఎన్‌టీయూకు వచ్చి పలు సందేహాలను లేవనెత్తారని, వారి అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఉపకులపతి కిషన్ కుమార్ రెడ్డిపై ఉందని అన్నారు. వర్సిటీ ఆచార్యులతో పాటు ప్రభుత్వ పెద్దలకు అగంతకుడి నుంచి ఈ-మెయిల్స్ రావడం, రౌట్లింగన్ వర్సిటీ ఫేక్ విద్యాసంస్థ అని ప్రచారం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ మెయిల్స్‌లోని సమాచారం సరైనది కానిపక్షంలో విశ్వ విద్యాలయంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘాల ప్రతినిధులు రాహుల్ నాయక్, సాగర్, భానుప్రకాష్, ఎర్రవల్లి జగన్, దిలీప్ తదితరులు వీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.